భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి


సూరారంకాలనీలోని వాసుదేవ ఆశ్రమంలో హనుమాన్ చాలీసా పారాయణం


జగద్గిరిగుట్ట కొండపై ఉన్న వేంకటేశ్వరుడుని దర్శించుకుంటున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీవేణు గోపాలస్వామి ఆలయం, హెచ్‌ఎంటీ కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు రామాలయాలకు భక్తులు ఉదయం నుంచే తరలి వచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభిషేకాలు, పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

– కుత్బుల్లాపూర్


భక్తులతో కిటకిటలాడిన జగద్గిరిగుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం




జీడిమెట్ల డిడిజన్‌లోని గోదావరి హోమ్స్‌లో జరిగిన ఏకదశి పూజలో పాల్గొన్న భక్తులు


నిజాంపేట్‌లోని శ్రీసీతారామచంద్ర ఆలయ పూజల్లో చైర్మన్ కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

త్యాగాలకు ప్రతీక బక్రీద్


ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వివేకానంద్


జగద్గిరిగుట్టలోని ఈద్గాలో ప్రార్థనల దృశ్యం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం బక్రీద్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. జగద్గిరిగుట్ట, గురుమూర్తినగర్, బాచుపల్లి, కొంపల్లి, చింతల్, జీడిమెట్ల, సూరారం ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాల సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ త్యాగాలకు ప్రతీకగా జరుపుకునే పండగని పలువురు పేర్కొన్నారు.

– కుత్బుల్లాపూర్


సాయినగర్ ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


భౌరంపేట్‌లో ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి


నిజాంపేట్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ముస్లిం పెద్దలు

క్లుప్తంగా

నిర్వహణ కరువు.. చోరీకి గురవుతూ..


జగద్గిరిగుట్ట కొండపై వృథాగా బయో టాయిలెట్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో టాయిలెట్ల నిర్వహణ లోపం కారణంగా వృథాగా పడి ఉన్నాయి. మూడేళ్ల క్రితం వివిధ ప్రాంతాలలో అధికారులు మైల్డ్ స్టీల్ టాయిలెట్లు, బయో టాయిలెట్లను అమర్చారు. కాని వాటి నిర్వహణ మాత్రం అంతంత మాత్రమగానే ఉంది. కాగా లోపల ఉన్న సామగ్రిని అందినకాడికి దోచుకెళ్లారు. ఒకటి రెండు చోట్ల మాత్రమే నిర్వహణ బాగుంది. మిగితా చోట్ల పనికిరాకుండా పోయాయి. జగద్గిరిగుట్ట కొండపై అమర్చిన టాయిలెట్లలో తాళం పగలగొట్టి మరీ సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఇక వార్డు కార్యాలయం సమీపంలో మరియు దేవమ్మ బస్తీలో కూడా అదే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు టాయిలెట్ల నిర్వహణపై చొరవ చూపి ప్రజలకి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యా హక్కు చట్టానికి ప్రభుత్వం తూట్లు

పంజగుట్ట: తెలంగాణ ప్రభుత్వం విద్యా హక్కు చట్టం అమలు పరచకుండా కార్పొరేట్ విద్యా సంస్థల అడుగులకు మడుగులు ఒత్తుతోందని మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు దోమల మల్లేష్ మాదిగ ఆరోపించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్ విద్యా సంస్థల్లో 25 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఉన్నా ఏ విద్యా సంస్థా దాన్ని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు నిబంధనలు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోచుకుంటున్న కార్పొరేట్ శక్తుల ఆగడాలను అరికట్టడమే లక్ష్యంగా మాదిగ దండోరా పనిచేస్తుందన్నారు. ఎస్సీ జనాభా దామాషా ప్రకారం అన్ని పార్టీలు సీట్లు కేటాయించాలని ఇదే విషయమై అన్ని పార్టీల అధ్యక్షులతో త్వరలోనే కలుస్తామన్నారు. ఉద్యమ సమయంలో వామపక్ష విద్యార్థి నాయకులు, కుల సంఘాలలో పనిచేసిన వారు తెలంగాణ మాదిగ శక్తి పేరుతో ఉద్యమాలు నడిపిన వారి అనుభవాల నుంచి మాదిగ దండోరా ఏర్పడిందన్నారు.

ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీ

జగద్గిరిగుట్ట: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీకి గురైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అంజయ్యనగర్‌కు చెందిన ప్రకాష్ (33) ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రకాష్‌కి (టీఎస్15 ఈజీ6983) టీవీస్ బైక్ ఉంది. ఎప్పటిలాగే బుధవారం రాత్రి తన గేట్ ముందు పార్క్ చేసాడు. కాగా గురువారం లేచి చూసేసరికి తన బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

బీజేపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్
- బీజేపీ సంయుక్త మోర్చాల సభ్యులతో సమావేశంల


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బీజేపీ బలోపేతానికి బూత్‌స్థాయి నుంచి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం గండిమైసమ్మ చౌరస్తాలోని వేదిక ఫంక్షన్‌హాల్‌లో అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్‌ల ఆధ్వర్యంలో సంయుక్త మోర్చాల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అనేక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తోందని పేర్కొన్నారు. పార్టీలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, యువ మోర్చా, మహిళా మోర్చాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కార్యకర్తులు సమష్టిగా పని చేస్తే పార్టీ గెలుపు నల్లేరు మీద నడకేనని అన్నారు.

◆ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు రెండూ కుటుంబ పార్టీలేనని విమర్శించారు. సీఎం కేసీఆర్‌ను గద్దె దింపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డా. ఎస్ మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాధవి, రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు దాసరి శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటు


బాచుపల్లిలో సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


సాయిచంద్ భౌతికదేహానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

నిజాంపేట్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. గురువారం బాచుపల్లిలో సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో తన పాటల ద్వారా సాయిచంద్ ప్రజల్లో చైతన్యం నింపారన్నారు. ఆయన భౌతికంగా దూరమైనా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామనర్సయ్య, చంద్రయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు అశ్రు నివాళులు

దుండిగల్: గుండెపోటుతో మృతి చెందిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, గాయకుడు సాయి చంద్ భౌతికకాయానికి బుధవారం శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారుడిగా సాయిచంద్ సేవలు ఈ రాష్ట్ర ప్రజలు మరువరని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు


నందానగర్‌కు వెళ్లే రోడ్డులో రాకపోలకు అడ్డదంకిగా ఉంచిన క్రేన్, కంటైనర్ వాహనాలు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ పారిశ్రామికవాడలో లోడింగ్, అన్‌లోడింగ్‌కు వచ్చే భారీ వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్నాయి. గాంధీనగర్ పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమలకు సరుకును లోడింగ్, అన్‌లోడింగ్ చేసేందుకు నిత్యం పదుల సంఖ్యలో భారీ వాహనాలు వస్తుంటాయి. ఈ క్రమంలో పరిశ్రమల ముందు రోడ్డుపై వాటిని గంటల తరబడి నిలపడం, లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తుండటంతో అసలే 30ఫీట్ల మేర ఉన్న రోడ్లు కాస్తా మరింత కుచించుకుపోతున్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే ఇతర వాహనదారులు ఇబ్బందులు పడతున్నారు. ముఖ్యంగా నందానగర్, గాంధీనగర్‌లకు వెళ్లే రోడ్లలో ఈ పరిస్థితి నెలకొనడంతో స్థానికులు, స్థానికంగా ఉన్న ప్రజలు, స్కూళ్లకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వాహనాలు నిలుపుతునన వారిపై పరిశ్రమల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



3న గురుపౌర్ణమి వేడుకలు

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలను సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు డి రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి గురువారం ఉత్సవాల ఏర్పాట్లను వివరించారు. ఉదయం 5.30 గంటలకు సాయిబాబాకు కాగడ హారతితో ఉత్సవాలు ప్రారంభిస్తారు. 7 గంటల నుంచి 8 గంటల వరకు పంచామృతాభిషేకం, సాయి అష్టోత్త రాలు, విష్ణుసహస్రనామం, భజన కార్యక్రమాలు, 9 గంటలకు శేజ్ హారతితో ఉత్సవాలు ముగుస్తాయి.

1న శాంతి సరోవర్‌లో సాయినిఖిత అరంగేట్రం

రాయదుర్గం: ఆంధ్రనాట్యం నృత్య ప్రదర్శనతో 16 ఏళ్ల సాయినిఖిత అరంగేట్రం చేయనుంది. గచ్చిబౌలి శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ రీజనల్ సెంటర్స్ ఇన్‌చార్జీ రాజయోగి బీకే కుల్‌దీప్, కెమెరామెన్, ఎడిటర్, దర్శకుడు మీర్, ఆయన సతీమణి భువనేశ్వరి, ప్రముఖ నటులు మధుశాలిని, గోకుల్ ఆనంద్ పాల్గొంటారు.

దివ్యాంగుల మహాధర్నాను జయప్రదం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జూలై 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే దివ్యాంగుల మహాధర్నాను జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, అ డివయ్య పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దివ్యాంగుల మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో దివ్యాంగులకు రక్షణ లేకుండాపోతుందన్నారు. బాలికలు, మూగ, చెవిటి, మానసిక మహిళా దివ్యాంగులపై లైంగిక వేధింపులు, అత్యాచారులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ ప్రధాని పీవీకి భారతరత్న ఇవ్వాలి

లిబర్టీ: మాజీ ప్రధాన మంత్రి, బహుభాషా కోవిదుడు, దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, రాజకీయ దురంధరుడు దివంగత పి.వి.నర్సింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వాలని లోక్ దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్వర్గీయ పీవీ దేశానికి ప్రజలకు అందించిన సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారత రత్న అవార్డు ఇచ్చి గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... దేశంలో ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రధానిగా ఉన్న పీవీ సరళీకృత ఆర్థిక విధానాలకు శ్రీకారం చుట్టి ఆర్థిక రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. 1995లో తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు అనేక దేశాలు పీవీని అభినందించాయని ఆయన అన్నారు. రాజకీయ విలువలతో కూడిన జీవితాన్ని గడిపారని తన రాజకీయ జీవితంలో మచ్చలేని మహోన్నత వ్యక్తిగా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. నిజాయితీ నిలుపుటద్దంగా పీవీ పని చేశారని పేర్కొన్నారు. నాయకురాళ్లు వాసంతి, సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం

ఎమ్మెల్యే వివేకానంద్

రంగారెడ్డినగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని బీజేఆర్‌నగర్‌కు చెందిన వనమాల అఖిల ఇటీవలే జరిగిన రాష్ట్ర స్థాయి 10 మీటర్ల రైఫిల్ చాంపియన్‌షిప్, సీఎం కప్‌లలో బంగారు పతకాలను సాధించింది. ఈ నేపథ్యంలో గురువారం పేట్‌బషీరాబాద్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలవగా అఖిలను అభినందించి సత్కరించారు.

◆ చింతల్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ బస్తీలో సీసీ రోడ్లు, లైబ్రరీ ఏర్పాటు, హై స్కూల్ భవనాలను ఏర్పాటు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తంగ లక్ష్మారెడ్డి, భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండల శ్రీనాథ్‌రావు, జనరల్ సెక్రటరీ సత్యం, కార్యవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు.

కొంపల్లి - బహదూర్‌పల్లి రోడ్డును విస్తరించడంలో విఫలం

కుత్బుల్లాపూర్: నియంత పోకడలతో సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారని తెలంగాణ బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు డా. మల్లారెడ్డి అన్నారు. గురువారం మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా కొంపల్లిలో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్ల నిధులతో సుచిత్ర నుంచి కొంపల్లి వరకు 6లైన్ల రోడ్ల విస్తరణతో పాటు ఫ్లైఓవర్ల నిర్మాణాలు చేపడుతోందన్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం కొంపలి నుంచి బహదూర్‌పల్లి వరకు ఉన్న రోడ్డు విస్తరణ మాత్రం చేపట్టలేకపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ రాజిరెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సీనియర్ నాయకులు చక్రధర్, జీవన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజు, శ్రీకాంత్, బాగయ్య తదితరులు పాల్గొన్నారు.


కొంపల్లిలో గడప గడపకు బీజేపీ ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర నాయకుడు మల్లారెడ్డి

పదో తరగతి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న రవితేజ ఫౌండేషన్ సభ్యులు

రంగారెడ్డినగర్: ప్రతిభకు ఎల్లలు లేవని నిరూపించేది విద్యార్థులేనని ఏసీపీ అల్లం సుభాష్ చంద్రబోస్ అన్నారు. రెండేళ్ల క్రితం కరోనాతో మృతి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, సంఘ సేవకులు జింకల రవితేజ ముదిరాజ్ ద్వితీయ వర్ధంతిని గురువారం పంచశీలకాలనీలో రవితేజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు జింలక వెంకటేష్‌ముదిరాజ్, పారిశ్రామికవేత్త వాకిటి రామ్‌రెడ్డి ల చేతుల మీదుగా పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సత్కరించారు.

◆ ఈ సందర్భంగా చెన్నరెడ్డి నగర్ ప్రాథమిక పాఠశాల పూర్వవిద్యార్థి తండూరి భాషయ్య పది కుర్చీలను ఉపాధ్యాయురాలు పార్వతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి కార్పొరేటర్ ఆగం పాండుముదిరాజ్, కుత్బుల్లాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సారా శంకర్‌ముదిరాజ్, గాంధీనగర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రాములు, శ్రీసాయి గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజేశ్వర్, సూర్యనారాయణ పంచశీల కాలనీవాసులు కేవెల్ రమణారెడ్డి, రవీందర్‌రెడ్డి, సతీష్, ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

సుభాష్‌నగర్: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గురువారం సూరారం గ్రామంలోని వీవీపీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణమాదిగ మాట్లాడుతూ... జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తొమ్మిదేళ్లుగా తాత్సరం చేస్తోందన్నారు. తెలంగాణలో ప్రధానంగా రెండు యూనియన్లు ఉన్నప్పటికీ ఒకటి ప్రభుత్వానికి బానిసగా మరొకటి నిషా స్థితిలో ఉందని ఎద్దేవా చేశారు.

◆ జర్నలిస్టుల సమస్యలను సాధించుకోవడం కోసం పోరాటం చేసేది, కొట్లాడేది ఏకైక సంస్థ మాదిగ జర్నలిస్ట్ ఫోరమని పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధనకు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంస్థ మాదిగ జర్నలిస్టుల హక్కు ఫోరం నిరంతరం పోరాటాలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ సలహాదారుడు లక్ష్మణ్‌మాదిగ, మాదిగ జర్నలిస్టు జాతీయ అధ్యక్షుడు మాతంగి దాసు, కార్యదర్శి రేణిగుంట్ల శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు సుంచు అశోక్, కార్యదర్శి డప్పు రామస్వామి, కోశాధికారి సాయి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ